# అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తుంది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- కేసీఆరే హ్యాట్రిక్ సీఎం..
- బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన
- బీజేపీకి క్యాడర్ కరువు
- కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి
- ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మొద్దు
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 2: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో 70 నుంచి 75 స్థానాల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో రావడం ఖాయమని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఎందుకంటే ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మవద్దో ప్రజలకు తెలుసని అన్నారు. పదేండ్లుగా బీఆర్ఎస్ పాలనను కండ్లారా చూసి ఆదరిస్తున్నారని తెలిపారు. ఇతర పార్టీలవారు మొక్కుబడిగా ఎన్నికలప్పుడు హడావుడి చేస్తే నమ్మబోరని, ఉత్తుత్తి హామీలు ఇచ్చేవారు ఎవరు? హామీలను నిలబెట్టుకునే వారు ఎవరనేది ప్రజలకు బాగా తెలుసని చెప్పారు. బయట హంగామా చేస్తున్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీకి ఓటర్లు లేరని అన్నారు. బీఆర్ఎస్‌కే బలమైన ఓటు బ్యాంకు ఉందని వెల్లడించారు. ప్రజలకు కేసీఆర్‌పైనే విశ్వాసం ఉందన్నారు. ఆయన మాటిస్తే తప్పకుండా చేస్తాడని, మోసంచేసే అలవాటు లేదని తెలిపారు. ఆరు నూరైనా.. నూరు ఆరైనా కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో అంతటా పాలన, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు రానీయకుండా.. ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని కూడా కేసీఆర్ ఆపలేదని గుర్తుచేశారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్లను సకాలంలో అందజేశారని వివరించారు. కేసీఆర్ వద్ద సమర్థవంతమైన నాయకత్వం ఉండబట్టే ప్రజలకు ఇబ్బందులు రాలేదని, బీఆర్ఎస్ పాలనకు ఇదే నిదర్శనమని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అభ్యర్థులందరూ అఖండ మెజారిటీ సాధిస్తారని అన్నారు. కొన్ని సర్వే సంస్థలు.. వారికి అనుకూలంగా ఉండే పార్టీలవైపే ఎగ్జిట్ పోల్స్ చూపిస్తున్నాయని అన్నారు. కానీ, ఎగ్జిట్ పోల్స్‌కు ఎగ్జాక్ట్ పోల్స్‌కు చాలా తేడా ఉంటుందన్నారు. పోలింగ్ పూర్తయిన ఐదారు గంటల తర్వాతనే వాస్తవాలు తెలుస్తాయని, వెంటనే వెల్లడించే పోల్స్‌ను నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం ఉదయం కచ్చితమైన పోల్స్ బయటపడుతాయని, నూటికి నూరుశాతం తిరిగి బీఆర్ఎస్ పార్టీ గెలుపు సాధిస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. లేదంటే పేదోడి సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు అన్నీ ఆగిపోతాయని తెలిపారు. ప్రజలు.. ఎవరి కండ్లను వారు పొడుచుకోరని అన్నారు. తాను బాన్సువాడలోని ఓ పోలింగ్ బూత్‌కు వెళ్లినప్పుడు రాజవ్వ అనే వృద్ధురాలిని పలుకరిస్తే.. 'కడుపునిండా అన్నంతినేలా చేసిన మిమ్మల్ని ఎట్లా మర్చిపోతం.. కారు గుర్తుకే ఓటేసినం. వేరే పార్టీవాళ్లు పైసలిచ్చినా తీసుకోలేదు..' అని తనతో చెప్పిందని స్పీకర్ వివరించారు. ఇలా లక్షలాది మంది ఆశీర్వాదం కేసీఆర్‌పై ఉందని, డబ్బులు పంచినంత మాత్రానా ఓట్లు పడతాయని, గెలుస్తామని చెప్పుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి ఉందన్నారు. బీజేపీకి మద్దతుగా కేంద్ర మంత్రులు, పెద్ద నాయకులు వచ్చి ప్రచారం చేసినా, కాంగ్రెస్ వారు బోలెడన్ని ఉత్తుత్తి హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మలేదని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు పాల్గొన్నారు.

### అందరికీ ధన్యవాదాలు..

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి ఉన్నది ఉన్నట్లుగా నిజాలను రాసిన మీడియా సంస్థలు, పాత్రికేయులకు స్పీకర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ గెలుపుకోసం తనకన్నా ఎక్కువగా శ్రమించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతోపాటు నిండు మనస్సుతో ఆశీర్వదించిన ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పారు.



స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహిస్తున్న పూజారి

## కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు ప్రారంభం

రామారెడ్డి, డిసెంబర్ 2: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంతతధారాభిషేకం తదితర కార్యక్రమాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పూజారులు, ఈవో ప్రభురాంచంద్రం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని మూలబావికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంగళ వాయిద్యాలతో జలాన్ని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణ దాతలుగా తన్నీర్ శేఖర్ –లలిత దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, వంశీశర్మ, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

## ఒంటరిగా సికింద్రాబాద్‌కు వెళ్లిన చిన్నారులు

- బోధన్‌కు చెందిన అన్నాచెల్లెలుగా గుర్తింపు
- చైల్డ్‌కేర్ సెంటర్‌లో చేర్పించిన రైల్వే పోలీసులు



సికింద్రాబాద్ రైల్వే పోలీసులు చేరదీసిన చిన్నారులు అన్విత, శివచరణ్

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 2: జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు ట్రైన్‌లో ఒంటరిగా సికింద్రాబాద్‌కు వెళ్లారు. ప్లాట్‌ఫాంపై ఒంటరిగా తిరుగుతుండగా గమనించి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది వారిని చేరదీసి వివరాలు సేకరించారు. బోధన్ పట్టణానికి చెందిన అన్నా చెల్లెలు శివచరణ్, అన్వితగా గుర్తించారు. తమది బోధన్ పట్టణం అని, తల్లిదండ్రుల పేర్లు రవి, అనితగా చిన్నారులు వెల్లడించారు. సికింద్రాబాద్‌కు ఎలా వచ్చారని ప్రశ్నించగా.. తెలియదని ఒకరు.. తమ తల్లి ట్రైన్‌లో ఎక్కించిందని మరొకరు సమాధానమిచ్చారు. అయితే వారు శుక్రవారమే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు చిన్నారులను స్థానిక చైల్డ్ కేర్ సెంటర్‌లో చేర్పించారు. వారి తల్లిదండ్రుల వివరాలు తెలిసినవారు సికింద్రాబాద్ రైల్వే ఎస్సై (9704003532) లేదా నిజామాబాద్ రైల్వే ఎస్సై తాహూ నాయక్ (8712658591) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## కౌంటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

### బీఆర్ఎస్ ఏజెంట్లకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచనలు

కామారెడ్డి, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్లు లెక్కించేటప్పుడు బీఆర్ఎస్ పార్టీ తరపున హాజరయ్యే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏజెంట్లతోపాటు ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, సీనియర్ అడ్వొకేట్ రామారావు, నాయకులు మామిండ్ల అంజయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, కాంశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏజెంట్లు, నాయకులకు సూచనలిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



## ఊపందుకున్న వరినాట్లు

### ఉపాధి పొందుతున్న పశ్చిమబెంగాల్ కూలీలు

యాసంగి వరినాట్లు ఊపందుకున్నాయి. దుక్కులు, నారుమళ్లు వేస్తూ రైతన్నలంతా బిజీగా మారారు. దీంతో పశ్చిమబెంగాల్, బిహార్, యూపీ రాష్ట్రాల నుంచి కూలీలు వలసవచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఎకరం చొప్పున మాట్లాడుకొని నాట్లు వేస్తున్నారు. ప్రతి సీజన్‌లో తెలంగాణకు వచ్చి నాలుగు డబ్బులు సంపాదించుకుంటామని వలస కూలీలు పేర్కొన్నారు. -ధర్పల్లి, డిసెంబర్ 2